# అవలక్ష్మణ సింగ్

## కామారెడ్డి డీఎంహెచ్‌వోపై ఐదు కేసులు

- మహిళా సిబ్బందిని లైంగికంగా వేధించిన ఫలితం
- శాఖాపరమైన విచారణ చేపట్టిన వైద్యశాఖ
- బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు



డీఎంహెచ్‌వోను విచారిస్తున్న రాష్ట్ర వైద్యాధికారి అమర్‌సింగ్ నాయక్, చిత్రంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, వైద్య సిబ్బంది

కామారెడ్డి,మే 15: మహిళా వైద్య సిబ్బందిని లైంగికంగా వేధించిన వ్యవహారంలో కామారెడ్డి డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌పై దేవునిపల్లి పోలీసుస్టేషన్‌లో బుధవారం ఐదు కేసులు నమోదయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు డీఎంహెచ్‌వోను అదుపులోకి తీసుకుని విచారించనున్నట్లు తెలిసింది. లైంగిక వేధింపుల వ్యవహారంలో లక్ష్మణ్‌సింగ్‌పై ఇప్పటికే శాఖాపరమైన విచారణ కొనసాగుతున్నది. తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, లైంగికంగా వేధిస్తున్నాడని 20 మంది మహిళా మెడికల్ ఆఫీసర్లు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర వైద్యాధికారి అమర్‌సింగ్ నాయక్ బుధవారం స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సమక్షంలో బాధిత వైద్య సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు.

**వంకరబుద్ధి..**

డీఎంహెచ్‌వోగా వచ్చిన లక్ష్మణ్‌సింగ్ వైద్యశాఖను గాడిలో పెడుతున్నారనే భావన కలిగించారు. అయితే, తనిఖీల పేరుతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తూ వక్రబుద్ధి ప్రదర్శించడం ప్రారంభించాడు. పీహెచ్‌సీలకు వెళ్లి అక్కడి మహిళా ఉద్యోగులతో అసభ్యంగా ప్రవర్తించడం, పక్కనే కూర్చోవాలని ఒత్తిడి చేయడం, ఫోన్‌లో అనుచితమైన పదాలతో మాట్లాడడం వంటివి చేస్తుండడంతో ఉద్యోగులు వారిలో వారు కుమిలిపోయారు. వైవాహిక స్థితిగతులను అడగడం, శారీరకంగా తాకడం వంటివి చేస్తుండడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమయ్యారు. ఎవరైనా ఎదురుతిరిగితే కక్షగట్టి అందరి ముందు గట్టిగా అరవడం, అవమానించడం వంటివి చేస్తుండడంతో మహిళా వైద్యాధికారులు విధులకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. చివరకు ధైర్యం తెచ్చుకుని సాక్ష్యాధారాలు సేకరించి ఉన్నతాధికారులకు దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధుశర్మతో పాటు వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వైద్యారోగ్య శాఖ విచారణకు ఆదేశించింది.


**సమగ్ర విచారణ..**

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డాక్టర్ అమర్‌సింగ్ నాయక్ బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సమక్షంలో మహిళా మెడికల్ ఆఫీసర్లు తమ గోడు వెల్లబోసుకున్నారు. తమను ఏవిధంగా ఇబ్బంది పెట్టింది వివరించారు. తనిఖీల పేరిట వచ్చి అసభ్యకరంగా తాకడం, ఒడిలో కూర్చోవాలని ఒత్తిడి చేయడం వంటివి చేసేవాడని వాపోయారు. ఏడాదిన్నర కాలంగా తమతో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని, శారీరకంగా తాకుతూ ఇబ్బందులు పెడుతున్నాడని, ఫోన్లలో అసభ్యంగా మాట్లాడుతున్నాడని తెలిపారు. తన చాంబర్‌కు వెళ్తే అసభ్యకరంగా వ్యవహరించేవాడని, పురుషుల ముందు తమ అందం గురించి మాట్లాడేవారని వివరించారు. మూడు గంటల పాటు సాగిన విచారణ అనంతరం బాధిత ఉద్యోగులు దేవునిపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వివిధ సెక్షన్ల కింద ఐదు కేసులు నమోదు చేసిన పోలీసులు డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌ను అదుపులోకి తీసుకోనున్నట్లు తెలిసింది.

## రేపు జాబ్ ఫెయిర్



ఖలీల్‌వాడి, మే 15: జిల్లా కేంద్రంలోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో ఈనెల 17న 'జాబ్ ఫెయిర్' నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ హరిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా టాటా ఎలక్ట్రానిక్స్, రిలయన్స్ అడ్డా, షీ టీమ్, యాక్సిస్ బ్యాంకు, ఫాక్స్‌కాన్ తదితర కంపెనీల ప్రతినిధులు వస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ, డిప్లొమా, ఇంటర్, బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే పర్సనల్ రౌండ్, హెచ్‌ఆర్ రౌండ్‌లకు హాజరుకావాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడెటా, విద్యార్హత సర్టిఫికెట్లు, రెండు ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు.



హైదరాబాద్-బోధన్ ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు



మొలకలు వచ్చిన ధాన్యాన్ని పోలీస్ అధికారికి చూపిస్తున్న రైతు

### కొనుగోళ్లలో జాప్యం..

# సర్కారుపై ఆగ్రహం

- రోడ్డెక్కిన అన్నదాత
- అకాల వర్షానికి తడిసిన ధాన్యం
- తూకం, రవాణా నిర్లక్ష్యంపై మండిపడ్డ రైతులు

నిజాంసాగర్, మే 15: ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో అకాల వర్షానికి వడ్ల బస్తాలు తడిసి ముద్దయ్యాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కామారెడ్డి జిల్లా మహ్మద్‌నగర్ మండలం కొమలంచ గ్రామంలో బుధవారం అన్నదాతలు ఆందోళన చేపట్టారు. ధాన్యం తూకం వేయకుండా, తూకం వేసిన ధాన్యం తరలించకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల తీరుకు నిరసనగా కొమలంచ గేటు వద్ద బోధన్-హైదరాబాద్ జాతీయ రహదారిపై రైతులు బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఐదు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడుస్తున్నదని తెలిపారు. ఉన్నతాధికారులు వచ్చి తమ సమస్య పరిష్కరించే వరకు ధర్నా విరమించబోమని స్పష్టం చేశారు. సుమారు రెండు గంటలపాటు రాస్తారోకో నిర్వహించడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకొని ధర్నా విరమించాలని కోరగా ఉన్నతాధికారులు వచ్చి కొనుగోలు కేంద్రాల్లో కాంటాల సంఖ్య పెంచి లారీల కొరత తీరుస్తామని హామీ ఇచ్చే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించుకూర్చున్నారు. తహసీల్దార్ క్రాంతికుమార్ చేరుకొని కాంటాల సంఖ్య పెంచి, లారీల కొరత తీరుస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో గంగారెడ్డి, సత్యనారాయణ, బాల్ రెడ్డి, నారాయణ, రాజు, విఠల్ గౌడ్, జైపాల్ కుమార్, సాయిలు, రైతులు పాల్గొన్నారు.

### పదేండ్లలో ఇలాంటి పరిస్థితి రాలేదు...



గత పది సంవత్సరాల నుంచి ఇలాంటి ఇబ్బంది రాలేదు. మేము కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం పది రోజుల నుంచి తూకం చేయడం లేదు. సొసైటీ వాళ్లను అడిగితే రైస్‌మిల్లర్లు వద్దని చెబుతున్నారని సమాధానం ఇస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి మా రైతులను ఆదుకోవాలి.

**- సాదుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్, కొమలంచ**

### తడిసి మొలకలు వస్తున్నాయ్..



నాలుగు ఎకరాల్లో పంట పండించి నెలరోజులవుతున్నది. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి పది రోజులైనా పట్టించుకునే వారు లేరు. వర్షానికి ధాన్యం తడిసింది. మొలకలు వస్తున్నాయి. అధికారులు స్పందించి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి.

**- సాలె రాములు, రైతు**

### ఎవరూ పట్టించుకుంట లేరు..



మార్కెట్‌కు వడ్లు తీసుకవచ్చి నెల రోజులు అవుతున్నది. సంచులు నింపుత లేరు. లారీలు పంపుతలేరు. వానకు మొలకలు వస్తున్నాయి. మార్కెట్‌లో సంచికి రెండు కిలోల తరుగు తీస్తున్నారు. రైస్‌మిల్లుకు పోయినంక వారి ఇష్టం వచ్చినంత తీస్తున్నారు. గత పదేండ్లలో ఇట్ల జరగలేదు. అధికారులు కూడా పట్టించుకుంటలేరు.

**- కాశీరాం, రైతు**



పెద్దకొడప్‌గల్ సొసైటీలో తడిసిన జొన్న బస్తాలు



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

# రైతు కష్టం.. వర్షార్పణం

**అకాల వర్షానికి తడిసి ముద్దయిన జొన్నలు**

పెద్దకొడప్‌గల్, మే 15: జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘానికి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల రైతులు విక్రయానికి తీసుకొచ్చిన జొన్నలతోపాటు తూకం వేసిన జొన్న బస్తాలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. 10-15 రోజుల క్రితం జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చామని, తూకం వేసిన అనంతరం లారీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని రైతులు తెలిపారు. జొన్న బస్తాలను తరలించేందుకు ఒక్కో బస్తాకి రూ.10-రూ.20 తీసుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### లారీలు రావడం లేదు..



210 బస్తాల జొన్నలు తూకం వేసి వారం రోజులైనా లారీలు రాలేదు. ప్రైవేటు లారీలో తరలించాలంటే బస్తాకి రూ.20 నుంచి రూ.25లు తీసుకుంటున్నారు. వ్యవసాయ సహకార సంఘంలో రూ.8 నుంచి రూ.10లు తీసుకుంటున్నారు. లారీలు రాక ఇబ్బందులు పడుతున్నాం.

**- జక్కుల సాయిలు, రైతు, పెద్దకొడప్‌గల్**

### ఇబ్బంది లేకుండా చూస్తాం




ఇప్పటి వరకు 110 లారీలను పంపించాం. లారీల కొరత ఉండడంతో వర్షం నుంచి కాపాడేందుకు గోదాంలో నిల్వచేస్తాం. లారీలు వచ్చిన వెంటనే లోడ్ చేసి రైతులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

**- హన్మంత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్, పెద్దకొడప్‌గల్**



తడిసిన బస్తాల నుంచి మరో బస్తాలోకి జొన్నలను మారుస్తున్న రైతులు

# ముందస్తుకు సన్నద్ధం



వానకాలం సీజన్ ప్రారంభానికి మరో నెల గడువు ఉండగానే వరినారు సిద్ధమవుతున్నది. రాష్ట్రంలోనే ముందస్తుగా వరి సాగు చేసే ప్రాంతంగా పేరొందిన వర్ని, చందూర్, మోస్రా, కోటగిరి, బోధన్ తదితర మండలాల్లో రైతులు సాగు పనులను ప్రారంభించారు. వాతావరణ పరిస్థితులతోపాటు ముందస్తుగా వరి సాగు చేయడం ద్వారా కోతల సమయంలో అకాల వర్షాల బారినపడకుండా ఉండొచ్చని ఇక్కడి రైతులు పేర్కొంటున్నారు. చందూర్ మండల కేంద్రంలో యువరైతు చంద్రకాంత్ వ్యవసాయ క్షేత్రంలో వేసిన నారు ఏపుగా వస్తుండడంతో త్వరలోనే నాట్లు వేస్తానని చెబుతున్నారు.

*- చందూర్, మే 15*

## 17 నుంచి ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు



ఖలీల్‌వాడి, మే 15: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2017వ సంవత్సరానికి ముందు డిగ్రీలో చేరి పునఃప్రవేశం పొందిన ప్రథమ, తృతీయ సంవత్సర విద్యార్థుల బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈ నెల 17 నుంచి ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు వారి హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్షలకు హాజరయ్యే సమయంలో హాల్‌టికెట్‌తోపాటు ఐడీ ప్రూఫ్, ఎగ్జామ్ ప్యాడ్లను తప్పకుండా తీసుకొని రావాలని అధ్యాయన కేంద్ర రీజినల్ కోఆర్డినేటర్ రంజిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7382929612 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

## ఈ థియేటర్లలో సినిమాలు బంద్

ఖలీల్‌వాడి, మే 15: రెండు వారాల పాటు సినిమా ప్రదర్శనలు నిలిపివేస్తున్నట్లు సింగిల్‌స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు బుధవారం తెలిపాయి. ఆక్యుపెన్సీ తక్కువగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులతో స్వచ్ఛందంగా ప్రదర్శనలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నిర్మాతలు థియేటర్ల అద్దె పెంచాలని, పరిస్థితులు అనుకూలిస్తే ప్రదర్శనలు కొనసాగిస్తామన్నారు.

